నిర్మించినా.. నిరుపయోగమే

- మండలకేంద్రంలో తెరుచుకోని వ్యాపార దుకాణాలు
- వేలంపాట నిర్వహించిన పంచాయతీ అధికారులు
- బిల్లులు అందలేదని నిర్మాణాలను అప్పగించని కాంట్రాక్టర్



మూసి ఉన్న వ్యాపార దుకాణాలు

గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ నిధులు రూ. 20లక్షలతో నిర్మించిన వ్యాపార దుకాణ సముదాయాలు తెరచుకోవడం లేదు. దుకాణాలు నిర్మించిన కాంట్రాక్టర్‌కు సగం బిల్లులు మాత్రమే చెల్లించారు. మరో రూ.10లక్షల బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ భవన నిర్మాణాలను పంచాయతీకి అప్పగించలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా కాంప్లెక్స్‌ను ప్రారంభించి నెలలు గడుస్తున్నా తాళాలు మాత్రం తీయడం లేదు. పంచాయతీ అధికారులు వ్యాపార దుకాణ సముదాయాలకు వేలం పాట నిర్వహించారు. కానీ వాటిని వేలంపాడిన వారికి అప్పగించడం లేదు. గత పంచాయతీ పాలకవర్గం గ్రామపంచాయతీకి అదనపు అదాయం కోసం ప్రధాన రహదారికి ఆనుకొని వ్యాపార కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ నిధుల లేమి కారణమో, అధికారుల నిర్లక్ష్యమో పంచాయతీకి ప్రయోజనకరంగా ఉండే కాంప్లెక్స్‌ను అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి వ్యాపార దుకాణాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



పంచాయతీ అధికారులు స్పందించి ప్రజాప్రయోజనాల కోసం నిర్మించిన వ్యాపార దుకాణాల సముదాయాలను అందుబాటులోకి తేవాలి. రూ.లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలను ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంచడం సరికాదు.

– దోసల చంద్రం, గంభీరావుపేట

ఉన్నతాధికారులకు నివేదించాం

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన వ్యాపార దుకాణాల సముదాయానికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. అప్పట్లో ఉన్నతాధికారుల సూచనల మేరకు గదులకు వేలం పాట నిర్వహించాం. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం చూస్తున్నాం.

– లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట

క్లుప్తంగా

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేత



ఎస్పీ గిటె మహేశ్ బాబా సాహెబ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కులసంఘాల నాయకులు

సిరిసిల్ల: జిల్లా ఎస్పీగా కొత్తగా విధుల్లో చేరిన గిటే మహేశ్ బాబా సాహెబ్‌ను జిల్లాలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ ఆఫీస్‌లో రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ మున్నూరుకాపు అధ్యక్షుడు అగ్గి రాములు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, జిల్లా రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు భాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌రెడ్డి, కొడిమోజు దేవేందర్ పుష్పగుచ్ఛం అందించారు.

ఎల్లారెడ్డిపేట: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గిటే మహేశ్ బాబా సాహెబ్‌ను సోమవారం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు అగ్గి రాములు, న్యాలకొండ రాఘవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌రెడ్డి, కొడిమోజు దేవేందర్ తదితరులున్నారు.

రామాలయంలో డీఈవో పూజలు



పూజలు చేస్తున్న డీఈవో, తదితరులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి దేవాలయాన్ని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సందర్శించారు. కుటుంబసమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 700 ఏళ్ల చరిత్ర గల రామాలయం, ఆరిపోని నంద దీపం విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్, ఎంఈవో గంగారాం, ఉపాధ్యాయులు పంతులవారి శంకర్, మనోహర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాలకిషన్, కమిటీ సభ్యులు కిషన్, విజేందర్‌రెడ్డి, బాలయ్య, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న అధికారులు


వేములవాడరూరల్: వేములవాడ మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత సెంటర్‌లో చదివే దివ్యాంగుల చిన్నారులకు ఉపకరణాల పంపిణీ చేసినట్లు నిర్వాహకురాలు కత్తి జయలక్ష్మి తెలిపారు. జిల్లాకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేములవాడ భవిత సెంటర్ నుంచి హాజరైన చిన్నారులకు పరికరాలు అందించినట్లు ఆమె పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని బోజ్జపల్లిలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో 150మందికి వైద్య పరీక్షలు ఆస్పత్రి డాక్టర్ శ్రీకాంత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము, జిల్లా కార్యదర్శి పరశురాములు, శేఖర్, సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి తల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి మహిళలు పెద్దఎత్తున మంగళహారతులతో తరలివచ్చి మంగళ పూజచేశారు. పాడి, పశుసంపద, పంటలను సల్లంగా చూడాలని కోరుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భజన, సంకీర్తనలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్ గౌడ్, అర్చకులు బీటుకూరి నవీన్ చారి, గోదాగోష్టి సభ్యులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ప్రతిభ



గంభీరావుపేట : ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు



ముస్తాబాద్: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

గంభీరావుపేట: జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్–25 పోటీల్లో గంభీరావుపేటకు చెందిన సైమా క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. రెండ్రోజులక్రితం పెద్దపల్లిలో జరిగిన పోటీల్లో అండర్ 10, 12, 14 విభాగాల్లో 18 బంగారు, వెండి పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ విక్రమ్ తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులను ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జనార్దన్‌రెడ్డి, అకాడమీ గ్రాండ్ మాస్టర్ విద్యాసాగర్, చీఫ్ ఆర్గనైజర్ యాదగిరి, యోగ కోచ్ దేవయ్య అభినందించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థులు పెద్దపల్లిలో జరిగిన కరాటే పోటీల్లో సత్తాచాటారు. జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–12 విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని వి.అశ్విత, అండర్–14 విభాగంలో జె.నిహారిక బంగారు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు రవీందర్ తెలిపారు. అలాగే ఎండీ సమ్రీనా, పి.రచన, వెండి పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎల్లారెడ్డిపేట: దుమాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జాతీయ షావోలిన్ కుంగ్– ఫు బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. 1వ జాతీయ స్థాయి ఓపెన్ కుంగ్ ఫు– కరాటే చాంపియన్‌షిప్ 2025లో విద్యార్థులు నిమ్మల సాన్వి, నిమ్మల లోహిత పాల్గొని అండర్ 12 విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు. నిమ్మల రిత్విక, నిమ్మల ధనుజ్ఞ, సల్మాల అర్చిత పోటీల్లో మూడు వెండి పతకాలు సాధించారు. వీరిని కరాటే మాస్టర్ ఓరుగంటి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కన్నం గంగయ్య, ఉపాధ్యాయులు, అభినందించారు.

రాజన్న సేవలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే



వేములవాడ: వేములవాడ రాజన్నను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట ఫొటోకాల్ ఏఈవో అశోక్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ ఉన్నారు.

నియామకం

సిరిసిల్లటౌన్: బీజేపీ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వేముల వైశాలీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా, పట్టణ కార్యవర్గం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, పట్టణ మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు పండగ మాధవి, మచ్చ లక్ష్మి, చందుపట్ల స్రవంతి, భీమని శ్రీలత, అడ్డగట్ల లక్ష్మి, వేముల రజిత, గజ్జల అనిత, వేముల శ్రీలత, గుండెల్లి సంధ్య, రమ్య, మహిళా మోర్చా నాయకురాలు. కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో క్షయరహిత గ్రామాలు



శివంగాలపల్లిలో సమావేశమైన అధికారులు

వీర్నపల్లి/కోనరావుపేట: వీర్నపల్లి మండలంలోని కంచర్ల, కోనరావుపేట మండలం శివంగాలపల్లి, రామన్నపేటలు క్షయ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాయని జిల్లా క్షయ నివారణ అధికారి అనిత తెలిపారు. ఆయా గ్రామాల్లో సోమవారం పర్యటించిన సందర్భంగా మాట్లాడారు. 2024లో ఆయా గ్రామాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. రానున్న రోజుల్లో అన్ని గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. మండల వైద్యాధికారులు అనిత, వేణుమాధవ్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, కోనరావుపేట ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ఎస్టీఎస్ జేత్య, ఏఎన్ఎం రుతక్క, తదితరులున్నారు.


భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొంరయ్య విగ్రహాల నిర్మాణానికి గౌడ సంఘం, కురుమ యాదవ సంఘం నాయకులు సోమవారం భూమిపూజ చేశారు. నాయకులు ఎల్లాగౌడ్, లక్ష్మీపతిగౌడ్, సురేందర్‌రావు, కొమ్ము బాలయ్య, అంజన్‌రావు, శ్రీనివాస్‌రావు, ఎల్లం, శంకర్, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి వినతి



బోయినపల్లి: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మహిళా బీడీ కార్మికులకు రూ. 4వేలు పింఛన్ అందించాలని మండలంలోని రత్నంపేటలో సీపీఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు పంచాయతీ కార్యదర్శి సరితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామంచ అశోక్, మహిళా బీడీ కార్మికులు సరిత, మమత, మంజుల, లలిత, సంధ్య, జ్యోతి, రమ, రజిత, అయిలవ్వ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

- **రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు**

కోనరావుపేట: మండలకేంద్రం శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీర్నపల్లికి చెందిన దర్శనాల కరుణాకర్ సిరిసిల్ల నుంచి కోనరావుపేట మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. ఎగ్లాస్‌పూర్‌కు చెందిన గుంటి మల్లయ్య ఎగ్లాస్‌పూర్ నుంచి కోనరావుపేటకు వెళ్తుండగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. మల్లయ్య, కరుణాకర్‌కు గాయాలయ్యాయి. ఇద్దరిని 108లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.

రుద్రంగి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మానాలకు చెందిన గుగులోతు శ్రీకాంత్ రుద్రంగి నుంచి మానాలకు వెళ్తుండగా పెట్రోల్ బంకు సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలుకాగా 108లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముస్తాబాద్: మద్దికుంట శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలకేంద్రానికి చెందిన ఎదునూరి మల్లయ్య (56) పొలం నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చెల్లాపూర్‌కు చెందిన వ్యక్తి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లయ్య గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

- **చేపల కోసం గొడవ**

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు తగ్గుతుండగా చేపలు పట్టుకునేందుకు మత్స్యకారుల మధ్య గొడవలు తారాస్థాయికి చేరుతున్నాయి. వేములవాడ, సంకెపల్లి శివారులోని బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు పట్టణ ముదిరాజ్ కులస్తులు వెళ్లారు. ఇది మా పరిధిలోకే వస్తుందంటూ సంకెపల్లికి చెందిన ముదిరాజ్‌లు ఆందోళన దిగారు. అయితే రెడ్డిపురం క్వారీ సమీపంలో మూడేళ్లుగా తామే చేపలు పడుతున్నామని వేములవాడ ముదిరాజ్ కులస్తులు తెలిపారు. అయితే సంకెపల్లి భూములన్నీ ఇప్పటికే మధ్య మానేరులో కోల్పోయామని, ఇక్కడ మీరెలా ఎలా చేపలు పడతారంటూ సంకెపల్లి ముదిరాజ్‌లు అడ్డుకున్నారు. జిల్లా ఫిషరీష్ అధికారి సౌజన్య ఇరువర్గాలను శాంతింపజేసి హద్దులపై అధికారులతో మాట్లాడి నిర్ణయిస్తానని మూడు రోజుల గడువు ఇవ్వాలని కోరింది. అధికారి సూచన మేరకు ఇరువర్గాలు అక్కడి నుండి వెళ్లిపోయారు.

- **బకాయిలు చెల్లించాలి**

సిరిసిల్ల ఎడ్యుకేషన్: గతేడాది మూల్యాంకన విధుల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు సిబ్బందికి విద్యాశాఖ బకాయిలు చెల్లించాలని చెల్లించాలని టీఆర్టీఎఫ్ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాధికార్యాలయంలో వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, సిరిసిల్ల మండల అధ్యక్షుడు పోతుగంటి రమేశ్, ఎల్లారెడ్డిపేట మండల బాధ్యులు ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.

- **వట్టెంలలో చోరీ**

వేములవాడరూరల్: వట్టెంలలో రెండిళ్లలో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని మంద శ్రీనివాస్, ముష్కం సత్తయ్యకు చెందిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సై మారుతి స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


- **మంత్రిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు**

తంగళ్లపల్లి: వేములవాడ పర్యటనకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ... మంత్రి దృష్టికి నియోజకవర్గం సమస్యలను తీసుకువెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

- **నేడు రైతు నేస్తం**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని రైతు వేదిక ఆవరణలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఏఈవో అనూష సోమవారం తెలిపారు. రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వేసవిలో పంటలలో యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

'కేటీఆర్‌ను విమర్శిస్తే సహించం'



మాట్లాడుతున్న మాట్ల మధు

తంగళ్లపల్లి: తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు... మరోసారి కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోబోమన్నారు. టోని అంటే కేరాఫ్ అబద్ధాలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలన్నారు. ఇక్కడ బండి జగన్, సిలివేరి చిరంజీవి, గుండు ప్రేమ్ కుమార్, అమర్ రావు, కొమురయ్య, కృష్ణ, తదితరులున్నారు.



చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టర్ వినియోగంలో లేకపోవడంతో కూర్చునేందుకు నిర్మించిన గద్దెలపై స్లాబ్ బిల్లలు చోరీకి గురయ్యాయి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్లాబ్ బిల్లలను ఏర్పాటు చేసి ప్రయాణ ప్రాంగణాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కళాజ్యోతి, గ్రామపంచాయతీ కార్యదర్శి, నర్సింగాపూర్. :సెల్ నెం: 8985853136

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఉద్యోగ నియామక ఫలితాలు నిలిపివేయాలి



సిరిసిల్ల టౌన్ : కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యేంత వరకు వివిధ ప్రభుత్వ ఉద్యోగ ఎంపికల పరీక్షా ఫలితాలు నిలిపేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్ కోరారు. సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు గ్రూప్ 1, గ్రూప్ 2తోపాటు అన్ని పరీక్షా ఫలితాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. డప్పులు వాయిస్తూ నిరసనలు హోరెత్తించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుండా థామస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి గుంద్రెడ్డి రాజు, ఎలగందుల భిక్షపతి, జిల్లా కో కన్వీనర్ సావనపెల్లి రాకేశ్, పసుల దుర్గయ్య, సావనపెల్లి బాలయ్య, కొమ్ము రాజశేఖర్, తర్రె శంకర్, శరవింద్, డి నారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, తర్వాతే ఉద్యోగ నియామక ఫలితాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు మండలకేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో డప్పు చప్పుళ్లతో మహా ప్రదర్శనగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ భూపతికి వినతిపత్రం అందించారు. వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టబోమని హామీ ఇచ్చిన సీఎం ఇప్పుడు ఫలితాలు విడుదల చేయాలని చూస్తున్నారని, దీంతో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇక్కడ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరుకుటం తిరుపతి, ప్రధాన కార్యదర్శి నరేశ్ వర్మ, నాయకులు జోగు జగన్, పర్శరాం, తిరుపతి, ఇరిగి ప్రవీణ్, గొల్లపల్లి స్వామి, కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సాధికారిత సాధిస్తాం

సిరిసిల్లటౌన్: రాజ్యాధికారం సాధించేలా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్ సంఘ కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల బాలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి కమిటీలు వేస్తున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణ కమిటీ, యువత కమిటీ, మహిళా కమిటీలను ప్రకటించి వారికి నియామక పత్రాలు అందజేశారు. అంతకుముందు సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ బీసీలు జనాభా ప్రాతిపదిక పైన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని, అందుకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. పట్టణ గౌరవ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, జిల్లా యువత అధ్యక్ష కార్యదర్శులు అంకారపు మహేశ్, గుజ్జే శివరాం, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుజ్జే తార, జిల్లా ఉపాధ్యక్షుడు చింతకుంట వెంకటేశం, పత్తిపాక పద్మ, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య, జిల్లా నాయకులు గోశిక శ్రీనివాస్, కందుకూరి రామ గౌడ్, నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు గుజ్జేశివరాం, పట్టణ ప్రధాన కార్యదర్శి జక్కని రవి, యువత కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అన్నారపు వేణుగోపాల్ వెల్దండి సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన ఎల్ఎం 6 కాలువ పనులు పూర్తిచేసేందుకు రూ.1.25 కోట్ల నిధులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఎల్ఎం 6 కెనాల్ అసంపూర్తి పనులకోసం పెద్దలింగాపూర్‌లో ఏడు రోజులుగా రైతులు రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, ఎండి.సాదుల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల మద్దతు

రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి ఎల్ఎం6 కెనాల్ పనులు పూర్తి చేయాలని ఏడు రోజులుగా రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తుండగా సోమవారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మద్దతు తెలిపారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద లింగాపూర్, రామాజీపేట, బాలుమానిపల్లె, చిక్కుడువాని పల్లె, తదితర గ్రామాల రైతులు రిలే దీక్షలో పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు శిబిరంలో పాల్గొన్న రైతులకు మద్దతు ప్రకటించారు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైన పత్రాలు లేని ఆరు ద్విచక్రవాహనాలకు జరిమానా విధించారు. ఎస్సై రమాకాంత్ , హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.